**సాహిత్య మకరం దాస్వాదనలో మైమరచిన ఓ తండ్రి తన పిల్లలకు శరత్‌చంద్ర, మృణాళిని, తిలక్ అని పేర్లు పెట్టుకున్నాడు. ఆ పేర్లలోని అర్థాలకు, మృదుత్వానికి ప్రతీకలుగా వారు నిలుస్తా రని ఆయన అత్యాశ! మరి ఆయన ఆశయానికి చేయూత నిచ్చిన దెవరు?**

# ఎవరికెవరు?

**ఈశ్వరి**

"బాబూ శరత్!"

"పిలిచారా నాన్నగారూ?"

"ఒక్క రెండు నిముషాలు కూర్చో నాయనా. నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి. ఆదివారం కోసం ఎదురు చూస్తూ వారం రోజులు గడిపాను."

"ఈ రోజు ఆదివారమే నాన్నగారూ! కా దనటం లేదు. కానీ, రిటైరై ఇంట్లో కూర్చున్న మీకు ప్రతి దినమూ సెలవు దినమే. ప్రతి క్షణమూ తీరిక సమయమే. మరి నాకు అలా కాదుగా? కొన్ని ఆదివారాలు కేంపులలోనే గడిచిపోత యి. ఎప్పుడో జన్మ కొక్క టన్నట్లుగా అపురూపంగా నాకు మిగిలే ఈ ఆదివారాన్ని వృథా చేయలేను నాన్నా! మీ కోడలు, పిల్లలు పెరటి గుమ్మంలో సిద్ధంగా ఉన్నారు. మామయ్యగా రింటి కెళ్తున్నాం. రాత్రికి తిరి గొచ్చేస్తాముగా? అప్పుడు మాట్లాడుకుందాం."

మరో మాటకు ఆస్కార మివ్వకుండా వెళ్ళి స్కూటరు స్టార్ట్ చేస్తున్న పెద్ద కుమారుడి వైపు అలాగే చూస్తుండిపోయాడు విశ్వనాథ్.

ఆయన చూపులలోని నిర్వేదాన్ని అర్థం చేసుకోగల వా రా కుటుంబంలో లేకపోయినా, ప్రకృతిలో ఉన్నారన్న నమ్మకంతో తను పది సంవత్సరాల నుంచి ప్రేమగా పెంచుకుంటున్న తోట వైపు కదిలాడు.

వర్ష ఋతువు కావటంతో పచ్చగా కలకల లాడుతోంది పూదోట. గేటుకి రెండు వైపులా నలభై అడుగుల పొడవున ఉన్న పూల బాలలు "మీకు మే మున్నాం నాన్నగారూ!" అంటున్నట్లు తల లూపుతున్నాయి.

సన్న సన్నగా పడుతున్న వాన తుంపరలను ఆహ్వానిస్తూ, మొక్క మొక్కనూ పరామర్శిస్తూ, పూచిన ప్రతి పూవునీ స్పృశిస్తూ ఆనంద బాష్పాలను తుడుచుకోవడం కూడా మరిచిపోయి, గులాబీల అందాలను, ముద్దమందారాల సోయగాలనూ, క్రోటన్స్ మొక్కల విచిత్ర వర్ణాల అద్భుతలనూ పరికించి చూసి మైమరిచిపోయిన విశ్వనాథ్; ఎప్పటిలాగే తన బాధను మరిచిపోయేందుకు ప్రయత్నించాడు.

** ** **

భోజనాల సమయానికి అదే ఊళ్ళో ఉంటున్న కుమార్తె, అల్లుడు, ఇద్దరు మనుమలూ రావటంతో, విశ్వనాథ్ గుండెలోని ఆశల మొగ్గలు విచ్చుకోవటం ప్రారంభించాయి. విశ్వకవి రవీంద్రుని ఆరాధించే తన మనసుకి ఆయన భార్య పేరు అద్భుతంగా ఆలోచించి తన ముద్దులపట్టికి 'మృణాళిని' అని పేరు పెట్టుకున్నాడు. తన బిడ్డ జీవితం పూలబాట కావాలని ఆమెను డాక్టర్ని చేసి, మరో మనసున్న డాక్టరు చేతిలో పెట్టి, తృప్తిగా నిశ్వసించాడు. 'నా పాప మృణాళిని నా కోరిక తీరుస్తుంది. కా దనదు' అనుకుంటూ సంతోషంగా భోజనం ముగించాడు.

ఆశయాల రూపకల్పనకు దారా సుతు లెవ్వరూ తోడు రారని తెలుసుకోలేకపోయా డా అమాయక మేధావి!

ఆ సాయంకాలానికి విశ్వనాథ్ రెండవ కొడుకు, కోడలు వాళ్ళ పిల్ల లిద్దరినీ వెంటబెట్టుకుని పక్క ఊరు నుంచి వచ్చారు.

"చిన్నబాబూ! నువ్వు కూడా ఈ రోజు వస్తే బాగుంటుం దని అనుకున్నా నయ్యా! నా కోరిక తీర్చే ఉద్దేశంతోనే ఆ పరమేశ్వరుడు నిన్ను కూడా నే తలుచుకున్న వెంటనే నా దగ్గరకు పంపించాడు" అంటున్న తండ్రి పక్కనున్న గార్డెన్ కుర్చీలో కూర్చున్నాడు తిలక్.

"ఏమిటి నాన్నగారూ! మీ మనసులోని మాట నాతో చెప్పకూడదా?"

"కాఫీ, టిఫిన్లు కా నివ్వండి. అన్నయ్య, వదిన, పిల్లలు రాత్రికి వస్తారు. అందరి సమక్షంలో నా మనసు పుస్తకాన్ని విప్పుత ను. మీ రంత చదివి మెచ్చుకోవాలి మరి!"


"మీ కవిత్వం నా కెప్పుడూ అర్థం కాదు నాన్నా! మమ్మల్ని కూడా మీలాగే తెలుగు లిటరేచర్‌లో డాక్టర్లను చేయకపోయారా? ఇంజనీర్లనూ, మందుల డాక్టర్లనూ చేయటంతో మీ కవిత సౌరభాలను ఆస్వాదించే శక్తి సామర్థ్యాలు లేని పామరు ల్లాగా మిగిలిపోయాము."

"కవిత్వం ఉదర పోషణ చేయ లేదనే కదా బాబూ! నేను కూడా నా ఆశయాలకు కళ్ళెం వేసి, మిమ్మల్ని ముగ్గురినీ ఈ కాలానికి తగిన విధంగా ప్రయోజకుల్ని చేయవలసివచ్చింది! మీ పేర్లు మాత్రం నా మనసు చెప్పినట్లుగా పెట్టుకున్నాను. నా కదే తృప్తి."

"మీ పిచ్చి కబుర్లు ఎప్పుడూ ఉండేవే కానీ, పిల్లల్ని కాస్త లోపలికి రానిస్తారా?" రుసరుస లాడుతూ వచ్చిన ధర్మపత్నిని చూసి నవ్వుకున్నాడు విశ్వనాథ్.

"నన్ను చూస్తే మీ కంత నవ్వులాటగా ఉం దన్నమాట?"

"నిన్ను చూసి నవ్వటం లేదు పార్వతీ! నీ హావభావాలు చూసి నవ్వుతున్నాను. ఏభై సంవత్సరాల నీ సాహచర్యంలో నా కెప్పుడూ నువ్వు సత్యభామలాగే కనిపిస్తావు. మీ నాన్నగారు పొరపాటున నీకు 'పార్వతి' అని పేరు పెట్టాశారే



అని బాధపడుతుంటాను.''

''మొదలుపెట్టారూ? నా అనుమానం నిజంగా నిజమే నుమండీ! మీరు తెలుగు సాహిత్యాన్ని ముగించి డాక్టరేట్ పుచ్చుకున్న రోజుల్లో ఎవరో ఒక 'సత్యభామ' వలలో పడి ఉంటారు. లేకపోతే ఇన్నిసార్లు మీ నోట 'సత్యభామ' ప్రస్తావన వచ్చేది కాదు.

వచ్చినంత వేగంగా వెళ్తున్న భార్యవైపు చూస్తున్న విశ్వనాథ్‌కి నీ లాకాశంలో తేలితేలిపోతున్న మేఘమాలికల్లో ఐక్యమైపోవా లనిపించింది. ఆమె తన మనసు నర్థం చేసుకోనందుకు కృంగిపోయాడు.

** ** **

ఆ రాత్రి అందరి భోజనాలూ అయిన తర్వాత కుటుంబ సభ్యు లందరినీ హాల్లో సమావేశపరిచాడు విశ్వనాథ్.

''ఇ దేదో డబ్బు వ్యవహారమే!'' అనుకున్నా రందరూ.

''పిల్లలూ! నే నేమిటో మీకు తెలుసు. లెక్చరర్‌గా, ప్రిన్సిపాల్‌గా ఉద్యోగం చేసి నేను సంపాదించిన దంత సంసార నిర్వహణకే సరిపోయింది. రచయితగా నా చిరకాల వాంఛ నెరవేర్చుకోవాలి. ఇప్పుడు నేను రెండు పుస్తకాలు అచ్చు వేయించుకోవా లనుకుంటున్నాను. ఇరవై వేల రూపాయలు ఖర్చవుతుంది. మీ అభిప్రాయం చెప్పండి.''

''అయిదు సంవత్సరాల క్రితం మీరు బాంకులో దాచిన లక్ష రూపాయలూ ఇప్పుడు రెండు లక్ష లయ్యాయి కదా నాన్నగారూ! అవి అలాగే మళ్ళీ ఫిక్సెడ్ డిపాజిట్ చేస్తే మరో అయి దేళ్ళలో నాలుగు లక్ష లవుతయి. వృథాగా అందులో నుంచి ఇరవై వేలు తీయకండి. అందువల్ల మీకు వచ్చే లాభం ఏమీ లేదు నాన్నగారూ!''

లాభ నష్టాల బేరీజు వేసే పెద్ద కొడుకు వైపు చూడలేక శూన్యంలోకి చూశాడు విశ్వనాథ్. ''శరత్‌చంద్ర అని నీకు పేరు పెట్టుకున్నప్పుడు మనసులో మురిసిపోయాను బాబూ! నువ్వు 'శరత్'లాంటి రచయితవు కాలేకపోయినా, కనీసం సాహిత్యాభిమానివైనా కావా లనుకున్నాను. అయి దేళ్ళ క్రితం నేను ఇదే కోరికను వెలిబుచ్చితే తర్వాత చూద్దాంలెండి అన్నారు మీ రంత. నా పరిశోధనలు పూర్తి కాలేదని అప్పుడు మీ ఇష్టప్రకారం చేశాను. డబ్బుని బాంకులో వేశాను. ఇప్పుడు నా జీవిత శయం నెరవేర్చుకోకుండా నేను బ్రతకలేను. మీ రెవరూ కా దనకండి.''

''నాన్నగారూ! మీరు అచ్చు వేయించే పుస్తకాలు ఎవరు చదువుత రు చెప్పండి? ఒక టేమో ప్రాచీన సాహిత్యం గురించి రాసిన వ్యాస సంపుటి. రెండవ దేమో కవిత్వం. ఈ రోజుల్లో ఇవి ఎవరి క్కావాలి? బ్రతుకు పందెంలో పరుగులు తీస్తూ, ఆకాశపు టంచుల్ని అందుకోవాలనీ, అందరికంటే పైమెట్టు మీద నిలవాలనీ తపన పడుతున్న ఈ యాంత్రిక జన సమూహానికి కవిత్వం చదివి, ఆస్వాదించగల రస హృదయం ఉం దంటారా? ఇప్పటి యువతకు కావలసిన రీతిలో మీరు రాయగలిగితే చెప్పండి. నేను అచ్చు వేయిస్తాను.''

ఏటికి ఎదు రీదవద్దని కుండ బద్దలుకొట్టినట్లు చెబుతున్న చిన్నకొడుకు వైపు సాలోచనగా చూశాడు విశ్వనాథ్. ''తిలక్! అందరూ అంతే అని ఎందు కనుకోవాలి? నాలాగా ఆలోచించే వాళ్ళు కొందరైనా ఉండ రంటావా?''

''ఉండరు నాన్నా! ఉంటే మీలాగే అన్నింటికీ ఇబ్బందులు పడక తప్పదు. మీ నిర్ణయాన్ని మార్చుకోండి.'' ఇక చెప్పే దేమీ లే దన్నట్లు సోఫాలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు తిలక్.

''ఇంత అనుభవం ఉన్న మీలో ఇంకా ఈ భ్రమ లేమిటి నాన్నగారూ?''

తన కుమార్తె అలా మ్లాట్లాడుతూం దని ఊహించని ఆ పితృ హృదయం ఆకులా అల్ల ల్లాడిపోయింది.

''మృణాళినీ! నువ్వూ ఇలాగే అంటున్నావా తల్లీ?''

''లోకం తీరు తెలుసుకో మంటున్నాను నాన్నా! ఏ పబ్లిషరూ మీ పుస్తకాలు అచ్చు వేయటానికి అంగీకరించటం లే దని మీ రింత సాహసం చేయబూనటం బావుండలేదు. ఇరవై వే లన్నది మొదలుపెట్టిన తర్వాత నలభై వే లవుతుంది. మీ పెన్షను మీకూ, అమ్మకూ సరిపోతోంది. ఉండటానికి ఇంత పెద్ద ఇ ల్లున్నది. ఈ రెండు లక్షల్లో మా అందరి పిల్ల లారుగురికీ తల కొక ముప్ఫయి వేలు, మిగిలిన ఇరవై వేలు అమ్మకూ బాంకులో ఫిక్సెడ్ డిపాజిట్ చేయండి నాన్నా! మాకు నిశ్చింతగా ఉంటుంది.''

''నాకు నిశ్చింత కాదు కదమ్మా! నా సర్వీసు మొత్తంలో ఎంతో కష్టపడి రెండు కవిత సంపుటలు అచ్చు వేయించుకున్నాను. ఇక ఈ రెండు పుస్తకాలూ అచ్చు వేయిస్తే గాని నా జీవిత శయం నెరవేరదు, మన శ్శాంతి లభించదు. ఇంతకాలం మీ చదువులు, వివాహాలు నన్ను బాధ్యత బంధాలతో బంధించాయి. ఇప్పుడు నేను అన్ని బంధాల నుంచీ విముక్తిడి నయ్యాను. మీరంత రెక్కలొచ్చిన పక్షులు. తండ్రిగా మీకు చెప్పటం నా కర్తవ్యం అనుకున్నాను. కా దనవద్దు.''

''మీ ఆలోచనని మార్చుకోండి నాన్నా! ఇంత కష్టపడి మీరు రెండు వేల పుస్తకాలు అచ్చు వేయించా రనుకోండి. అవి ఎక్కడ భద్రపరుస్తారు? ఎంతకాలం అలా ఉంచుకోగలరు? వాటికి చెదలు పట్టకుండా మందులు చల్లుతూ జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఒక గది, రెండు బీరువాలు వాటికోసం వృథాగా కేటాయించాలి. ఇప్పటికే మీరు సేకరించిన పుస్తకాలతో మీ గది నిండిపోయింది.''


''మృణాళినీ! నిన్ను డాక్టరు చదివించి పొరపాటు చేసినట్లున్నాను. లిటరేచరు చదివించి ఉండవలసింది. గత జల సేతుబంధనం ఎందుకు కానీ, నేను అచ్చు వేయించే పుస్తకాలను నా బీరువాలలో దాచిపెట్ట నమ్మా! మన ఆంధ్రాలో ఉన్న ముఖ్యమైన లైబ్రరీలకూ, స్కూళ్ళూ, కాలేజీలకూ ఉచితంగా పంపిస్తాను.''

''అక్కడమాత్రం ఎవరు చదువుత రు, నాన్నా ఇలాంటి పుస్తకాలు? సెక్స్, క్రైమ్, లవ్ స్టోరీలు రాయండి. క్లాసు పుస్తకాలకంటే శ్రద్ధగా చదువుత రు.''

''జాతి మొత్తం ఎప్పుడూ దిగజారిపోదమ్మా! ఉత్తమ సాహితీప్రియులు ఎల్లవేళలా ఉంటారు. పిల్లలూ! ఈ రాత్రంత వాదించుకున్నా ఈ సమస్య పరిష్కారం కాదు కానీ, మీ రంత వెళ్ళి నిద్రపొండి. ఆయన డబ్బుని ఆయన తగలేసుకుంటా నంటుంటే మీ కెందు కింత ఆరాటం, ఆలోచన? లేవండి!'' ముందుగా లోపలి కెళ్తున్న భార్య మాటలు విశ్వనాథ్‌కి కరెంటు షాకులా అనిపించాయి.

''పార్వతీ! ఇ న్నేళ్ళ నా సాహచర్యంలో నా అనుభూతులలో కొన్ని అణువులైనా నీ మనసుని స్పృశించలే దంటే నా జీవితమే వ్యర్థ మనిపిస్తోంది. నేను పోయినా నా ఆశయాలు నా భార్యాబిడ్డలు నెరవేరుస్తా రనుకునేవాడిని. నేను బ్రతికుండగానే ఇలా ప్రవర్తించిన మిమ్మల్ని నా ఆశా కిరణాలుగా భావించలేను.

''నా జీవితమంత ధారపోసి మిమ్మ ల్నందరినీ ఇంతవాళ్ళను చేశాను. అది నా విద్యుక్తధర్మమే! కా దనటం లేదు. మరి మీ విద్యుక్తధర్మంగా నా కోరికను మీ సంపాదనతో తీర్చవలసిన మీరు నా కష్టార్జితా న్ని నేను ఖర్చుపెట్టుకుంటా నంటుంటే, కా దంటున్నారు. అదీ ఒక మంచి పనికి, సరస్వతీ సేవకు, నా తృప్తి కోసం. పిల్ల లందరి మాటల్లో





స్వార్థం. సుఖభోగాలపైన వ్యామోహం కనిపించాయి. మరి నీ మాటలలో? స్తోమత ఉండి కూడా చిన్న ఆశయాన్ని నెరవేర్చుకోవటం తగలేసుకోవటంలా భావిస్తున్న నీ మాటలలోని భావాన్ని విప్పి చెప్పటానికి భాష చాలక నేనే కాదు. ఆ వాగ్దేవి కూడా అసహ్యించుకుంటుంది. 'సహధర్మచారిణి' అనే పదానికి నిర్వచనాన్ని మార్చి రాయాలి పార్వతీ! ఇన్ని సంవత్సరాలుగా మీ అందరి కోసం అణుచుకున్న నా కోర్కెలను నెరవేర్చుకుంటాను. నా కుటుంబ సభ్యు లని మీకు ప్రేమ. గౌరవం ఇచ్చాను. అవి మీరు నిలుపుకోలేకపోయారు. నేను అనుకున్న పనిని రేపే మొదలుపెడుతున్నాను.''

మరో మాటకు అవకాశ మివ్వకుండా పోర్టికో దగ్గరి కెళ్ళాడు విశ్వనాథ్.

నీలాకాశంలో మేఘాల చాటు నుంచి వెలుపలికి వచ్చిన శశికాంతుని వెన్నెల చిరునవ్వులు తన కెంతో ధైర్యా న్నిస్తున్న ట్లనిపించింది.

అతని అభిప్రాయాలను ఆ కుటుంబ సభ్యులంతా నిరసించినా. ఆయన ఆత్మబంధువులైన పూలబాలలు తాము ఆమోదించినట్లు మనోహరంగా తల లూపుతున్నాయి. ఆ సుందర దృశ్యాన్ని చూసి. 'నాకు తోడు మీ రున్నారు. నా ఆశయ సాధనలో అవరోధా లెన్ని వచ్చినా అధిగమిస్తాను.' స్థిరంగా అనుకున్నాడు విశ్వనాథ్. ★